# ఎందుకు విడిపోయారు?

★

శ్రీ యస్. ఆర్. చంద్రూర్

"వాళ్లు ఎందుకు విడిపోయారు?"

ఈ ప్రశ్న నన్ను కనీసం పదిమంది అయినా అడిగివుంటారు. వాళ్లు ఎందుకు విడిపోయారని చెప్పేది? కలిసివుండటంలోని ఘనత విడిపోవటంలో ఎలా వుంటుంది? ఇద్దరు విడిపోయారనగానే ఆ విడిపోవడానికి వెనకనున్న కారణాలేమిటో తెలుసుకోవాలని వుండటం సహజమే గా!

ఎవరైనా విడిపోతారు గాని వాళ్ళ స్నేహం మట్టుకు కలకాలం నిలుస్తుందనుకున్నారు చాలామంది. నేను వాళ్ళది మృత్యువులో కూడా విడిపోని స్నేహ బాంధవ్యమనుకున్నాను. అంత ఘట్టిగా నమ్మకం నాకు వుండటంవల్లనే కాబోలు, పది మందీ నన్ను అడుగుతూ వచ్చారు. వాళ్ళు ఎందుకు విడిపోయారని.

మన స్నేహసంపర్కాలు బహు తమాషాగా ఉంటాయి. మనకి స్నేహం అనుకున్న వారి విషయంలో, ఒక్కొక్కప్పుడు నానా శ్రమాపడి, వారికోసం మన ప్రాణాలుకూడా వొడ్డుతాము. అలాటి స్నేహితులు కొంతకాలమైనాక జనసామాన్యంలో కలిసి పోతారు. కాలం గడిచి, అంతా ఒకటే అని రుజువయినమీదట, ఆ స్నేహితుడికోసం అరనిముషం కూడా ఆలోచించము. ఒకనాడు ప్రాణప్రదంగా తోచిన వ్యక్తి, ఈనాడు జనబాహుళ్యంలో ఒకడుగా ఎందుకు అయిపోతున్నాడంటే, అందుకు కారణం ఒక్కటే. కాలం ఎలా మారుతుందో స్నేహితాలు కూడా అలాగే మారుతాయి. ఈకాలం మార్పు కలిమిలేములతో ప్రమేయం లేనిది.

ప్రియంవదని మొట్టమొదట రాజమండ్రి ఆర్యాపురంలో మిట్టమధ్యాహ్నం వేళ చూశాను. మండు ఎండలో రిక్షాలో రావటంవల్ల నాకది వేసవికాలమని అనిపించింది గాని, ప్రియంవద యింట్లో పాదం పెట్టేటప్పటికి అది ఏకాలమో మర్చిపోయాను. కిటికీలకీ ద్వారబంధాలకి, కట్టిన వట్టివేళ్ళ తడికెలు గదిని అమితంగా చల్లబరుస్తున్నాయి. వాటికితోడు పైన, శబ్దం చెయ్యకుండా మెల్లగా తిరుగుతున్న ఫాన్. చాపమీద తెల్లటి పరుపు పరుచుకుని, బాకాసు గోడ కానించి కూచున్నాడు ఉమాపతి. పక్కగా చాపమీద ఇతికిలబడింది ప్రియంవద. నన్ను అక్కడవున్న కుర్చీలో కూచోమన్నారు. కుర్చీ వద్దని, నేనుకూడా ఉమాపతి పక్కగా పరుపుమీద కూచున్నాను.

"ఏమోయ్ కులాసాగా వున్నావా, మీ నాన్నగారు బావున్నారా?" అని కుశల ప్రశ్న వేశాడు ఉమాపతి.

"ఎండలోనుంచి వచ్చారు. కాసిని మంచినీళ్లు పుచ్చుకుంటారా?" అని ప్రియంవద కోకిలకంఠంతో అడిగింది.

మంచినీళ్లు కావాలన్నాను. మూలగా కుర్చీ పీటమీదవున్న కూజాలోనుంచి నీళ్ళు గాజు గ్లాసులోకి వొంపి, తీసుకువచ్చి యిచ్చింది ప్రియంవద.

ప్రియంవద నిజంగా దివ్యసుందర విగ్రహం. విశాలమైన కళ్ళు, చక్కటి కనురెప్పలు, వెన్నెల జార్చే చెక్కిళ్ళు, మొహానికి తగిన ముక్కు, నవ్వుకి అందమిచ్చే పలువరసా, శంఖంలాటి మెడా మొత్తానికి ఆమెది పరిపూర్ణమైన విగ్రహం. స్త్రీలయినా పురుషులయినా ఆమెని మరోకసారి రెప్ప వాల్చక చూస్తారు. అంతటి అందగత్తె ప్రియంవద.

ఉమాపతి గ్రంథసాంగుడు. ఆయనకి ఈ ప్రియంవద ఏడో ప్రియురాలో ఎనిమిదో ప్రియురాలో అయివుండాలి. ఉమాపతి అప్పటికి నలభైఏళ్ళవాడు. ఉద్యోగరీత్యా అతను తాసిల్దార్. ఆయిన గ్రంథసాంగుడవటంవల్లగానీ, లేకపోతే, ఏనాడో డిప్టీకలెక్టర్ అయివుండవలసినవాడు.

ఉమాపతి తండ్రి యింకా బతికివున్నాడు. ముసిలాయన కలప వ్యాపారంచేసి అరవై డబ్భయి వేలదాకా సంపాయించాడు. ఈ ఉమాపతి ఆయనకి

ఒక్కగానొక్క కొడుకు. అందుచేత ఉమాపతి ఉద్యోగం చేసినా చెయ్యకపోయినా, కాలిమీద కాలు వేసుకు కూచుని తినగలిగినంత ఘనవసతి వుంది. కాని ఉద్యోగం పురుషలక్షణం గదా అని ఉమాపతి ఈ తాసిల్దార్ ఉద్యోగం వెలగబెడుతున్నాడు.

ఉమాపతి ఘోటక బ్రహ్మచారి కాడు; అతనికి యిద్దరు ఆడపిల్లలూ, ఒక మొగపిల్లాడూను. పిల్లల చదువు చెడిపోతుందని పిల్లల్నీ భార్యనీ తలిదండ్రుల దగ్గర గుంటూరులో ఉంచానంటాడు అతను. "అది వొట్టి అబద్ధం. ఈయన వినోదాలకి ఆవిడగారు ఆటంకం కాబట్టి, దూరంగా అట్టేపెట్టాడు"— అంటారు తెలిసినవాళ్లూ, తెలియనివాళ్లూ కూడాను. ఏమయినా ఉమాపతి భార్యని నేను యింతవరకూ చూడలేదు. ఆవిడ రూపసి అని చెప్పగా విన్నాను. ఎటొచ్చీ, ఆవిడ వుంటున్నది అత్తారింట్లోనే కాబట్టి, ఉమాపతి ఎక్కువ రోష్టు పడకుండా తప్పింది

ఇంతకీ ఉమాపతి నాకెలా తెలియవచ్చాడో చెప్పాలిగా! మూడేళ్ళ క్రితం అతను యిక్కడ తాసిల్దారీ చేస్తున్నప్పుడు మా యింట్లో ఒక వాటాలో ఉండేవాడు. ఇప్పుడంటే నేను పరిపూర్ణ పట్టభద్రుడ నయాను గాని అప్పటికింకా ఫోర్తు యియర్ వాణ్ణే. సంసారం చట్టుబండలూ వుందిగదా అని మా నాన్నగారు వాటాయిచ్చారు. అదీగాక ఉమాపతి తండ్రీ, మా నాన్నగారూ ఏ సత్రంలోనో ఏ రైలుస్టేషనులోనో ఎప్పుడో కలుసుకున్నారట. ఏమయితేనేం, తీరా వాటాయిచ్చిన తర్వాత మా నాన్నగారికి వెలక్కాయ గొంతుకులో పడ్డట్టయింది. ఈ ఉమాపతి కోసం ప్రతి శుక్రవారం సాయంత్రం ఒక అమ్మాయి, రెండు చీరెలు పట్టే లెదర సూట్‌కేసు చేతబుచ్చుకు వచ్చేది; మళ్ళీ సోమవారం ఉదయమే వెళ్ళిపోయేది. పద్దెనిమిది రూపాయిల వాటాకి యిరవైఅయిదు వస్తున్నాయని సంతోషించడమో, యిలాంటి అవినీతి తనకళ్ళముందు జరగకుండా అరికట్టడమో మా నాన్నగారికి తెలియక మథనపడేవాడు. తనకీ భార్యకీ పొరపులు రావడంవల్ల, ఈ పిల్లని తను రెండో పెళ్లి చేసుకోదలుచుకున్నట్టు ఉమాపతి మా నాన్నగారితో తన అంతర్యం చెబుతున్నట్టు చెప్పగానే, ఆయన ఆత్మవ్యథ అంతరించిపోయి, ఉమాపతి అంత ఉత్తమ పురుషుడు లేడని పొగడటం మొదలెట్టారు.

నాకుమట్టుకు ఉమాపతి జీవితం చాలా అడ్వెంచరెస్‌గా కనిపించేది. శని ఆదివారాల పిల్ల లేనప్పుడు నాతో బాతాఖానీ వేస్తూవుండేవాడాయన. ఆయన అధికారీ, నేను చిన్నవాణ్ణే అవడంవల్ల ఆయనని నేను 'మీరు' అనడం, ఆయన నన్ను 'నువ్వు' అనడం మొదటినుంచీ అలవాటయింది. ఉమాపతి చాలా కలుపుగోలుమనిషి; నవ్వుతాడు, నవ్విస్తాడు. ఆయన చాలా పుస్తకాలు చదివాడు. ఎన్నో విషయాలమీద అనర్గళంగా మాట్లాడగలడు.

తాసిల్దార్ అనగానే మనకొక రూపచిత్రణ ఏర్పడుతుంది మనసులో. అందుకు భిన్నమైనవాడు ఈ తాసిల్దార్. డ్యూటీలో చాలా నిక్కచ్చిగా వుండేవాడట గాని యితర వేళల ఎంతో సరసుడు. ఇద్దరం కలిసి ఎన్నోసార్లు గోదావరిగట్టుకి షికారుకి వెళ్లాం. నాకు తెలియని విషయాలెన్నో ఆయన గబగబా చెప్పుకుపోతూ వుండేవాడు.

మా యింట్లో సరిగ్గా నాలుగు నెలలు వున్నాడో లేదో గాని యింతలో కాకినాడ ట్రాన్స్‌ఫర్ అయింది ఆయనకి. ట్రాన్స్‌ఫరవడం నాకేమీ బావుండలేదు. ఆయన కలకాలం మా యింట్లోనే అద్దెకి వుండాలనుకున్నాను.

"మీ వాళ్లు మెడలువంచి పెళ్లి చేదామని తలపెట్టినా ఆ ద్రాక్షారం సంబంధం వొప్పుకోకు. మద్రాస్ పోయి యం. ఏ. చదువు. ఆపైన యింగ్లండు గానీ, అమెరికా గానీ వెళ్లే అవకాశం వుంటే, జారవిడుచుకోకు. దగ్గర లేకపోతే మాత్రమేం, మీ నాన్నని ఒక పదివేలు అప్పడెయ్యమను," అన్నాడు ఉమాపతి, రాజమండ్రి స్టేషన్లో రైలు ఎక్కుతూ. శనాదివారాల పిల్లకూడా అతని పక్కనే ఉంది ఆనాడు.

ఉమాపతి మాటలు ఏవో ఆశలు రేపుతాయి. అవి మనిషిని స్తబ్దుగా పడివుండనీవు. చైతన్యమే జీవలక్షణమని ప్రబోధిస్తాయి అతని మాటలు. ఇంగ్లండు అమెరికాల మాట అటువుంచి, నేను మద్రాస్ వెళ్ళి యం. ఏ. అయినా చదవలేదు. ఆ ద్రాక్షారం సంబంధమే చేసుకున్నాను. ఎటొచ్చీ, యింకా పిల్లల తండ్రిని మాత్రం కాలేదు. ఆ అదృష్టం కూడా ఎంతో దూరం లేదు మా ఆవిడని నేడో రేపో పుట్టింటివారు వచ్చి తీసుకువెళ్తారట. కొడుకు నెత్తుకు వస్తుందో, కూతురిని ఎత్తుకు వస్తుందో!

ఉమాపతి మరొక కొత్త రామచిలకతో దిగాడని వాళ్ళ ప్యూన్ చెప్పి, వారం రోజులు పయిగా

అయింది. ఏరోజు కారోజు వద్దామనుకునేవాడిని; పని లేనివాడికి తీరికవుండదు కనక ఈ పదిరోజులబట్టీ రావటం పడలేదు. ఏమయితేనేం, కనులపండువగా ప్రియంవదని చూశాను. ఒక్క స్త్రీ క్రీగంటి చూపు కోసం పురుషులు సమస్తం ఎందుకు వొదులుకుంటారో ఆమెని చూసినమీదట యిట్టే అర్థమవుతుంది.

"ప్రియా, యితనెవరో తెలుసా?"

"నాకెలా తెలుస్తుంది మీరు పరిచయం చెయ్యకుండా?" గంధర్వుల గానం అలాగే వుండి వుంటుంది.

పరిచయాలు అయినమీదట ప్రియంవద అంది. "ఈ యిల్లు చాలా యిరుకుగా వుంటోంది. మీ ప్రాంతాల ఏదైనా మంచియిల్లు వుంటే చూసి పెట్టండి."

"ఓ" అన్నాను.

"మీ పేటలో మాత్రం వొద్దుసుమా! నేను రెండో పెళ్లి చేసుకుంటానన్న పిల్ల ఈమె కాదని ప్రియంవదని దుయ్యబట్టుకుంటే! మీ నాన్నగారు అసాధ్యులు," అన్నాడు ఉమాపతి.

"ఎవరు? ఆ శనాది వారాల పిల్లా?" అంది ప్రియంవద మహా వెటకారంగా. ఈమెకి ఉమాపతి గురించి యావత్తూ తెలుసునా ఏమిటి?—అని సంశయం కలిగింది నాకు.

"అవును" అన్నాడు ఉమాపతి చాలా తేలికగా.

ఆ మధ్యాహ్నం ప్రియంవద ఐస్డ్ టీ యిచ్చింది. వేడి వేడి టీ తాగడమే గాని నాలిక జివ్వుమనే టీ తాగటం నాకు తెలీదు. ఆ టీమీద తేలిన నిమ్మడిప్పా, పొదీనా ఆకూ రమ్యాతి రమ్యంగా కనిపించాయి.

"ఇంతకంటె చెరుకుపానకం బావుంటుంది కదూ!" అన్నాను.

అలా అని వుండకూడదు. ఆతిథ్య మర్యాద, అందులో ప్రియంవదలాంటి జాణయిచ్చే ఆతిథ్య మర్యాద, తెలియనివాడనవటంవల్లనే, అంత తేలికగా, మాటలలోతు గ్రహించక, టుపుక్కున అనేశాను.

"చెరుకు పానకమనే యేమిటి? యింతకంటె ఎన్నో బావుంటాయి," అని ప్రియంవద అంటున్నప్పుడు, ఆమె కనుబొమలమీద, పెదవి వొంపులోనూ కనిపించిన నిర్లక్ష్యం నన్ను కాల్చేసింది. నా మాటకి మాట వొప్పజెప్పిందిగాని, కటువుగా ఏమీ అనలేదు. అయినప్పటికీ, ఆమె ఆ అరక్షణంలో చూపిన నిరసన ఏనటీమణీ చూపలేదు.

ఎంత తెలియనివాణ్ణయినా, ప్రియంవదతో మాట్లాడటం కత్తిమీద సాము అని తెలుసుకున్నాను. తూచి తూచి మాటలు వాడాలి. సంభాషణలో నిపుణత చూపాలి. చాతుర్యం కనబరచాలి. నోటికివచ్చినట్లా మాట్లాడటం ఆమెకి యిష్టం వుండదు. ఊరకదంపుగా వాగకూడదు. పదాల లాలిత్యం, సౌకుమార్యం, తీక్ష్ణత, ప్రభావం తెలుసుకు వాటని బాణాల్లా వాడాలి. ఒకమాట పువ్వులా తగిలితే, మరొకమాట బల్లెంలా గుచ్చుకోవాలి. పూజకి పువ్వులెంత అవసరమో, పొడుచుకునేందుకు బల్లెములు కూడా అంతే అవసరం.

"పాపం. అతను కుర్రాడు. నీ నెర్వరితనం అతనిమీదనా! నల్లటి టీ తాగుతున్నప్పుడు, చల్లటి చెరుకుపానకంజ్ఞాపకంవచ్చిందికాబోలు. అదీతప్పే!" అని నన్ను వెనకేసుకొచ్చాడు ఉమాపతి.

"అబ్బో—ఫ్రెండుని కాపాడుకుంటున్నారు! ఏమండీ, మిమ్మల్ని నే నేమయినా అన్నానా!" సంగనాచిగా అడిగింది ప్రియంవద, "ఉమాపతి చూడండి"—అన్నట్టు మొహం పెడుతూ.

ఈ మహానాటకంలో నేను అర్భకుణ్ణి. అది ఆమె స్వభావమో, నటనో నాకేం తెలుసు! అసలు మనం ఎంతవరకూ స్వభావనైజాన్ని ప్రదర్శిస్తామో, ఎంతవరకూ నటిస్తామో చెప్పటం మాటలా? ఆమె విసిరేమాటని మధ్యలో తెంపగలవాడు ఉమాపతి ఒక్కడే!

వాక్చాతుర్యంమాత్రమే ఆరాధించేమనిషి కాదు ప్రియంవద. ఆమెది నవనీతంతో పోల్చదగినహృదయం. చమత్కారధోరణి లేనప్పుడు ఆమె చూపే ఆప్యాయత మధురాతి మధురమైనది.

నేనూ ఉమాపతీ గోదావరిగట్టుకి షికారుకని వెళ్తూండగా ఆమె అంది: "రాత్రికి అయననికూడా తీసుకురండి—మనింటికి భోజనానికి."

"మరి అతను.........?"

"ఈపూట కాయగూరలే వండుతానులెండి," అంది ప్రియంవద.

అయితే వీరిద్దరూ మత్స్యమాంసాదులు తింటారన్నమాట. కాదంటే ప్రియంవదకి ఎక్కడ కోపం వస్తుందోనని, వచ్చేందుకు వొప్పుకున్నాను. అదీగాక, అందమైన స్త్రీలకి కోపం తెప్పించడం ఏ మొగవాడికి హితవుగా ఉంటుంది?

గోదావరిగట్టున చీడీలమీద నేనూ ఉమాపతీ కూచున్నాం. వెలుగు ఉందిగాని ఎండ పోయింది. గోదావరివంతెనమీదనుంచి ఏదో రైలు జెర్రిపోతులా జారిపోతోంది. రేవులోని పడవలూ లాంచీలూ సాయంత్రపు చిరుగాలికి అల్లల్లాడుతున్నాయి. ఉమాపతి కథనం మొదలెట్టాడు.

“ఆమెకి ఎన్నేళ్ళు ఉంటాయో చెప్పు?”

“పాతిక,” అన్నాను.

“ముప్పయ్యారు. పంధొమ్మిదేళ్ళ కూతురుందామెకి; ఆకూతురికి పెళ్ళి అయింది; ఒక ఆడపిల్ల కూడాను. పెద్దకూతురికి పంధొమ్మిదేళ్ళు; కొడుక్కి పదహారేళ్ళు; రెండో కూతురికి పధ్నాలుగేళ్ళు. ముగ్గురూ వాళ్ళఊళ్లో వున్నారు.”

“మరి—ఈమె మీతో వచ్చేస్తూవుంటే, వాళ్ల వాళ్లందరూ వూరుకున్నారా?”

“ఆడది తెగించి వీధినపడితే వూరుకోక వురి పెట్టుకుంటారా? అందరూ నోరు మూసుకు వూరుకున్నారు. అసలు నేను ప్రియంవదనే పెళ్లి చేసుకుని వుండవలసింది.”

“అప్పుడు మరొక అరుంధతిని నెత్తిని పెట్టుకు వుందురు మీరు?” ఇలాంటి జోక్సు ఉమాపతికి కష్టం కలిగించవు గనక ధయిర్యంతో అనేశాను.

“చూడు. ఒక స్త్రీ నీకోసం యిరవైరెండేళ్ళు పరితపించిందంటే, నీ కెంత గర్వంగా ఉంటుంది? ఈ నౌకర్లు, జీతాలు, డబ్బు, కుల గౌరవాలు, పుష్కమర్యాదలు, తాసిల్దార్ హోదా—యివన్నీ ఆ ఆత్మసంతుష్టిముందు దిగదుడుపు. ప్రియంవదని నా పదిహేడోయేట చూశాను; అప్పుడామె పైటలు వేసుకుంటూవుండేది. భద్రాచలంలో మా యింటికెదురుగా వుండేది వారియిల్లు. సందు దొరికితే యిద్దరం పారిపోయి, ఏవో అల్లీబిల్లీ కబుర్లు చెప్పుకునేవాళ్ళం. “నేను నిన్ను ప్రేమిస్తున్నాను”—అంటే—‘నేను నిన్ను ప్రేమిస్తున్నాను’ అని చెప్పుకునేవాళ్ళం. చూస్తూచూస్తూవుండగా ప్రియంవదకి పెళ్లిముహూర్తం నిశ్చయం చేశారు. ఆ వొచ్చే పెళ్లికొడుక్కి ‘మనం ప్రేమించుకుంటున్నట్లు చెబుదాం’ అన్నాను ప్రియంవదతో. అలాటి తప్పుడుపని చెయ్యొద్దనీ, పెళ్ళికొడుకుని తను పెళ్ళిచేసుకుంటున్నప్పటికీ, ప్రేమించడం మట్టుకు నన్నేననీ, నా చెంపలని తన చేతులతో నిమురుతూ చెప్పింది. ప్రియంవద మంగళసూత్రం కట్టించుకుంటున్నప్పుడు నాకు ఏడుపు వచ్చింది; తలిదండ్రులని ధిక్కరించక, చేజేతులా వొడంబడుతున్నందుకు, ఆమెమీదకూడా పళ్ళు పటపట కొరికాను.”

“ఆమె ఏమిచేస్తుంది—చిన్నపిల్ల! ఒకవేళ ఎదిరించిందే అనుకోండి—మీ కామెని పెళ్లిచేసుకో గల శక్తి యేది ఆనాడు?”

“అదంతా నిజమే. కాని నా మనస్థితి చెబుతున్నా. కాలక్రమేణా ప్రియంవదని మర్చిపోయాను. ఎందరో విలాసవతులు నన్ను పల్కరించి, వారిదారిని వారు వెళ్ళిపోయారు. రెండునెలలక్రితం ప్రియంవద విధివశాత్తూ కాకినాడ టవున్ రైలుస్టేషన్లో తటస్థపడింది. ఇట్టే నన్ను గుర్తించి ‘ఉమాపతీ—ఉమాపతీ’ అని పిల్చింది.”

“ఊఁ. తరవాత ఏమయింది?”

“ఆమెభర్త చనిపోయి ఆరునెలలయిందట. నన్ను ఎలా కలుసుకోవడమా అని ఆలోచిస్తోందట. పదిహేడోయేట నేను తీయించుకున్న ఫోటో, యిప్పటికీ ఆమె పెట్లో ఉంది. స్టేషనునుంచి తిన్నగా యింటికి వెళ్ళిపోయాము. ఆ ఉండటం ఉండటం ఒక వారంరోజులపాటు కాకినాడలో నాదగ్గర ఉండిపోయింది.”

ప్రేమ! ఎన్నో కావ్యాలురాసి, కథలల్లుతారు ఆ రెండక్షరాలమీద. తెలిసీ తెలియని వయసులో వలచిన యువకునికోసం యిరవైరెండేళ్ళు కనిపెట్టుకునివుంది ఒక స్త్రీ. ఈలోగా ఆమెకి వివాహమైంది; ముగ్గురు పిల్లలు కలిగారు; పెద్దకూతురికి వివాహమవడమే కాకుండా ఒక ఆడపిల్లకూడా కలిగింది; యిరవైరెండేళ్ళదాంపత్యజీవనం సాగించింది; తర్వాత భర్త మరణించాడు. తదనంతరం ఆమె తన ప్రియుణ్ణి వెతుక్కుంటూ వచ్చింది. ఉమాపతి నిజంగా ధన్యుడు; ఎందరెన్ని అనుకున్నా, అతను అదృష్టశాలి. ఇరవైరెండేళ్ళనిరీక్షణ ప్రియంవద ప్రేమలోని ఔన్నత్యానికి తార్కాణం. ఆ పారిశుద్ధ్యంలో ఎలాటి మాలిన్యమూ కరిగిపోతుంది.

ముగ్గురుపిల్లలతల్లి ఐన ప్రియంవద పాతికేళ్ళ మనిషిలా ఎలా కనిపించగలిగింది? ఆమె తలలో తెల్ల

వెంట్రుక మచ్చుకికూడా లేదు; కాని ఉమాపతికి ఈ పెడా, ఆ పెడా నెరిసిపోయింది. అనుభవాలతో ఉమాపతి విసుగుచెందితే, ఏకాగ్రతవల్ల హృదయంలోనియవ్వనాన్ని నిలుపుకోగలిగిందేమో ప్రియంవద. ఇంటికి వెళ్ళినతర్వాత ఆమె చేతులు రెండూ కళ్ళకి అద్దుకోవాలనిపించింది. స్వార్థం, మోసం మినహా ప్రేమ లేదనే నిరాశావాదులకి ప్రియంవద జీవిత మొక గుణపాఠం. ఒకవ్యక్తికోసం యిరవై రెండేళ్ళు కనిపెట్టుకు ఉండటం ప్రేమ గాకపోతే మరింకేమిటి ప్రేమ?

ఆరాత్రి భోజనాలవేళ ప్రియంవదమీద నాకు వున్న గౌరవాన్ని ఎలా వ్యక్తపరచాలో తెలియక తికమకపడ్డాను. ఆరోజు మొదలుకొని, నా భార్య పుట్టింటినుంచి వెంకటరమణదాసుని ఎత్తుకొచ్చేదాకా ప్రతిసాయంత్రం ప్రియంవదగారింట్లో ప్రజెంట్ వేయించుకుంటూనే వుండేవాణ్ణి.

"మీ శకుంతలకి మొన్ననేగాదుటండీ పద్నాలుగూ వెళ్ళింది. అప్పుడే పెళ్ళిప్రయత్నాలేమిటి?" అంది ప్రియంవద.

"తాతగారియింట్లో పెరిగారు. వాళ్లయిష్టం," అన్నాడు ఉమాపతి.

"మా మాధవికి మళ్లీ బడికి పంపించమనండి. ఆపైన వాళ్ళే యిష్టమయినవాణ్ణి చేసుకుంటారు" అంది ప్రియంవద. మాధవి ఆవిడ రెండోకూతురు.

"మనకెందుకు పోనిద్దూ—వాళ్లే గంగలో దిగితే మనకేం!"

ప్రియంవద మర్మంలేకుండా మాట్లాడుతోంది, కాని, ఉమాపతి దాస్తున్నాడు. నాకు ఆసంగతి అంతిక్రితం చెప్పనే చెప్పాడు. ప్రియంవదవల్ల మనమరాలికి పెళ్ళి కావాలని, అక్కడ గుంటూరునుంచి ఉమాపతి తండ్రి ఉత్తరంమీద ఉత్తరం దంచుతున్నాడు.

ఒకరోజు సాయంత్రం నేను వెళ్ళేటప్పటికి యిద్దరూ ఘర్షణపడుతున్నారు. కీచులాటలు నెల్లాళ్ళబట్టీ వింటున్నానుగాని అంత పెద్దగా మాటలనుకోవడం అదే మొదటిసారి.

"నాకో బండి కేకేసిపెట్టండి" అంది ప్రియంవద నన్ను చూసీచూడగానే.

"వెళ్లు. బెదిరిస్తావేమిటి?" అన్నాడు ఉమాపతి.

"మీపిల్లలకి పెళ్ళి కాకపోవడం, మీకు డిప్టీకలెక్టరీ కాకపోవడం, మీ యిల్లు గుల్లచేసుకుతిందామని నేను రావడం—యివన్నీ ఎందుకు చెప్పండి? అమర్యాదగా బతుకుతున్న ఆడదాన్ని నేను, ఘరానాగా తిరిగే ఉద్యోగస్తులు మీరు!"

"ఆమాటలు నేను అనలేదు. ఎవరో అన్నారని నామీద విరుచుకుపడి ఏం లాభం?" అన్నాడు ఉమాపతి.

"పోన్లెద్దురూ, మీదారి మీది, నాదారి నాది. కాస్త బండి పిలుచుకొస్తారూ?" అంది ప్రియంవద నా వంకగా తిరిగి.

"గతిలేక మీపంచకి రాలేదు, నేనూ రక్తమాంసాలు వున్నమనిషిని; నాకూ పిల్లా జెల్లా ఉన్నారు," ప్రియంవద సివంగిలా ఉంది. ఆమె కణతలమీది నరాలు ఉబ్బాయి.

"ప్రియా, నీకు యిష్టంగా వుంటే వుండు, కష్టంగావుంటే వెళ్లు. అంతేగాని ఎందుకీ రభస?"

"అవేమిమాటలు, ఉమాపతిగారూ! ప్రియంవద వెళ్ళడమేమిటి? ఆమె ఎక్కడికి వెళ్తుంది? ఇక్కడ వుండవలసిందే!" అన్నాను నేను.

"దిక్కులేనిపక్షినిగాను దయాధర్మభిక్షంమీద బతికేందుకు!" ప్రియంవదకి యాభైవేల రూపాయిల ఆస్తిఉంది.

ఆమె ధుర్రున వీధివాకిట్లోకి వచ్చింది. నేను వెంటవెళ్ళి, బతిమాలి, లోపలికి తీసుకువచ్చాను. ఎన్నేళ్లొచ్చినా ప్రేమలోపడ్డ మనుషులు చిన్నపిల్లల మాదిరి దెబ్బలాడుకుంటారు. ఆనాటికి వారిక్రోధాగ్ని ఉపశమనవాక్యాలతో తగ్గింది.

కాని వారం తిరక్కుండా మళ్ళీ కజ్జా వేసుకున్నారు. కొడుకు రాజమండ్రి కాలేజిలో యింటర్‌లో చేరుతాడంది ప్రియంవద. తమదగ్గిర వుండకోవడం యిష్టంలేకపోతే హాస్టల్లో అట్టే

అడదాకుంది. అసలు ఆ కుఱ్ఱాడు రాజమండ్రిలో చేరడమే పనికిరాదన్నాడు ఉమాపతి.

“నా పెద్దల్లుడికీ, పదిహేడేళ్ళ కొడుక్కీ లేని అభిమానం మీకు వచ్చిందా?” అని ప్రియంవద ఉమాపతిని వొదిలి వెళ్ళిపోయింది.

తలిదండ్రుల యిష్టప్రకారం వారికి నచ్చినపిల్లని పెళ్ళిచేసుకుని, బారసాలపీటలమీదకూచుని కుమారుని నామకరణమహోత్సవమూ తగుపరి సత్యనారాయణ వ్రతమూ జరిపిన నాడు కూడా, ఉమాపతి ఏదో కోహినూర్ వజ్రంలాటిది పోగొట్టుకున్నాడనిపించింది.

ప్రియంవద లేనిపిమ్మట డిప్టీకలెక్టరైమాత్రం బావుకునేదేమిటి?

ఇరవైరెండేళ్ళు ప్రేమించిన ప్రియంవదకి అన్యాయం జరిగిందంటారా? ప్రేమని నమ్ముకున్న ఏ స్త్రీ సుఖపడింది గనక ఈమె సుఖపడేందుకు? అసలు నన్ను అడిగితే ప్రేమ ఏమిటి?

డిప్టీకలెక్టర్ ఉమాపతిబుద్ధికుదిరి భార్యాపిల్లల్ని తెచ్చుకున్నాడు. ప్రియంవదకి యిరవైరెండేళ్ళ సంసారస్వప్నం కరిగిపోయింది. అందుకనే వాళ్ళు విడిపోయారు. తెలిసిందా?

